# 40. కోరిక తీరిన శుభవేళ

మానవులకు కోరికలుండడం సహజం. నావంటి సామాన్యుడికి అవి హెచ్చుగా ఉంటే అసహజమనిపిస్తుంది.

మాతండ్రి గారిది కుటుంబ పోషణకు మాత్రమే సరిపడిన ఉద్యోగం - నాకు, పెళ్ళి కావలసిన ఇద్దరు చెల్లెళ్ళు, చదువుతున్న తమ్ముడు - బియ్యే పాసై ఉద్యోగం లేని నేను- అందుచేత నా వంటివాడికి కోరికలుండకూడదు.

బజారులో మంచి ఆపిల్ పళ్లు చూసినా, రోడ్డుమీద పోయే అందమైన అమ్మాయిలను చూసినా, నా మనసు అదోవిధంగా ఉంటుంది.

కాబట్టి, కోరికలను అణచుకోడానికి చాలా ప్రయత్నాలు చేస్తాను.

ఈ మధ్య లైబ్రరీలో ఒక యింగ్లీషు మాస పత్రిక తిరగేస్తుంటే, ఒక వ్యాసం నన్ను ఆకర్షించింది.

"కోరికలు కోరు - వాటిని సాధించు" అన్న ఆ వ్యాసం నాకు చాలా నచ్చింది. మనిషికి ఆత్మ విశ్వాసం ముఖ్యమని, అది కలిగిననాడు ఏ పనేనా సాధించవచ్చునని అందులో ఉంది.

ఆత్మవిశ్వాసం పెంపుచేయడానికి రోజూ నువ్వు కోరిన దానిని మననం చేస్తే ఏదో నాడు అది ఫలిస్తుందని రాశాడు. ఇంకా ఏం రాశాడంటే, కోరికల లిస్టొకటి తయారు చేయమన్నాడు. ఆ లిస్టు ఎంతవరకు పెంచవచ్చునంటే, నూరు దాటకూడదన్నాడు. ఆ లిస్టును మననం చేసుకోవాలంటే సాంకేతిక పదాలతోనో, లేక కథల శీర్షికల మాదిరిగానో రాసుకుంటే మంచిదన్నాడు. చాలా కోరికలు కోరడం మంచిదే. అవి నెరవేరడానికి ఒకప్పుడు జీవితకాలం పడుతుంది. కాబట్టి, అధైర్యపడకుండా వాటిని సాధించేవరకు ప్రయత్నించమన్నాడు. అదృష్టవంతులకు అవకాశాలకు లోటుండదని, అందుచేత నిరుత్సాహపడవద్దని అన్నాడు. వ్యాసం చివరను అతనో హెచ్చరిక చేశాడు. చాలా కోరికలు తీర్చుకోడానికి చాలా శ్రమపడాలని, తీరా అవి చేతికందేసరికి అనుభవించే ఓపిక ఉండదని అన్నాడు. పది కోరికల లిస్టు ప్రశస్తమైనదని వివరించాడు.

నాకీ వ్యాసం చాలా నచ్చింది. నా కోరికలను అణచుకోనక్కరలేదు. వాటినిసాధించవచ్చు. అతను రాసినట్టు పది కోరికలకే ఆలోచనలు పరిమితం చేసుకుంటే బాగుటుంది.

అన్నిటికన్న ముందుగా కోరికను నిర్వచించాలి. ఇటువంటి ఆలోచనలకు బీచికంటే మంచి చోటులేదు.

ఒక సాయంకాలంపూట బీచిలో కూర్చున్నాను. అన్నిటికన్న, ఇష్టమయిన కోరిక ముందు కోరుకోమన్నాడు.

నేను తీరికవేళల్లో కథలు, కవితలు రాస్తుంటాను. ఒ పది కథలు, ఇరవై కవితలు ఇప్పటికే పత్రికలలో వచ్చాయి. నాకు సాహిత్యమంటే అంతులేని అభిమానం.పెద్ద పుస్తకాల షాపుల్లో, అందమైన జాకెట్లతో ముచ్చటైన ముద్రణతో, చక్కని గెటప్‌గల సాహిత్య గ్రంథాలు, ఆర్ట్ పేపరుమీద ఆర్ట్ గురించి చెప్పే పుస్తకాలు చూసి చూసి వాటిని కొనుక్కోవాలని అనుకుంటాను. ఆ ధరలను చూస్తే మూర్ఛ వచ్చినంత పని అవుతుంది.

అయిదు వందలు, ఆరు వందలు, ఆ రేట్లలో ఆపుస్తకాలన్నీ ఉన్నాయి.

నా కథలూ కవితలూ పుస్తకరూపంలో రావాలంటే ఏ పదిహేనువేలో ఇరవైవేలో అవుతుంది. నా తల్లిదండ్రులతో ఉన్నంతకాలం ఆ పనిచెయ్యలేను - నా భార్య వచ్చిన తరువాత ఆమె అసలే ఒప్పుకోదు. ఇక పుస్తకాలు కొనడం కూడా అటువంటిదే.

ఆ వ్యాసకర్త ఒక విషయం స్పష్టం చేశాడు.

కోరికకు దాని ఫలితానికి, దాని విలువ అడ్డం రాదన్నాడు. ఖరీదైన కోరిక అయితే శ్రమ కొంచెం హెచ్చు తప్ప మరేం భేదం లేదన్నాడు.

చాలాసేపు ఆలోచించాను. నా అభిమాన విషయం సాహిత్యం. అది నామొదటి కోరికకు సంబంధించింది.

అలాగే రెండో కోరిక సంగీతం.

మూడో కోరిక వాహనయోగం..

నాలుగో కోరిక మేలురకం భోజనం.

చివరది గాలి వెలుతుర్లు వచ్చే మంచి వసతి.

అన్నిటిని సూక్ష్మంగా చెప్తే,సాహిత్యం, సంగీతం, వాహనం భోజనం వసతిగా రూపొందాయి.

ఈ కోరికల తోరణాన్ని అక్కడికి తుంచివేశాను.

వ్యాసకర్త మరోటి చెప్పాడు- ఈ కోరికల సూక్ష్మ రూపాలను ఒక కాగితంమీద రాసుకొని ఎప్పుడూ జేబులో ఉంచుకోమన్నాడు. ఏ కోరిక ఏరోజుఏ తీరితే, దానిని టిక్కుపెట్టి తారీకు రాయమన్నాడు.

రోజూ పొద్దున్న పదిసార్లు, మధ్యాహ్నంపదిసార్లు, రాత్రిపడుక్కోబోయే ముందు పదిసార్లు ఆ లిస్టును చదువుతున్నాను.

ఏదో రోజు అదృష్టం కలిసివస్తుంది.

అది పదిరోజుల్లోనే వచ్చింది.

ఒక రోజు ఉదయం పదకొండు గంటలకు లైబ్రరీ నుండి వస్తుంటే, రోడ్డుమీద స్కూటరు శాస్త్రులుగారు కనిపించారు. నన్ను చూడగానే ఆయన బండి ఆపి నన్ను పిలిచారు. నమస్కారం చేశాను.

"ఒరే వెంకటేశ్వరులూ! ఏదైనా ఉద్యోగంలో కుదిరావా?"

ఆయన పెద్ద పెద్ద ఆఫీసర్ల ఇళ్ళలో పౌరోహిత్యాలు చేస్తారు. మాకు బాగా తెలుసు.

"లేదు శాస్త్రులు గారూ!"

"ఒరేయ్! ఒక చాలా పెద్ద ఆఫీసరు, చాలా చాలా నమ్మకమైన మనిషిని వారింట్లో పనిచేయడానికి, చూసిపెట్టమన్నారు. బట్ట, భోజనం, వసతి అన్నీ ఇస్తారు. వారింట్లో ఉండి, ఆయన, వారి సతీమణి చెప్పిన పనులన్నీ చెయ్యాలి. మంచి జీతం ఇస్తారు. మీ వాళ్లనడిగిచెప్పు".

మా వాళ్లనడిగితే వాళ్లేం చేస్తారు! ఆఫీసరు గారిది గవర్నమెంటు ఉద్యోగమే. నాకు వారిచ్చేది అటువంటిది కాదుకదా! మా వాళ్ళను ఒప్పించి, ఒక రోజు దొరగారింటికి చేరాను.

ఆయన చాల చక్కగా మాట్లాడారు.

అమ్మగారు చెప్పిన పనులు చేయాలి. వారానికొకసారి తెల్లటి బొచ్చు కుక్కలను రెండింటిని వెటర్నరీ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి డాక్టరుకు చూపించితేవాలి. పది రోజులకోసారి లైబ్రరీలో పుస్తకాలు దులపాలి. ఇంతకు మించి అప్పుడప్పుడు ఏవేవో పనులు - అన్నిటికన్న ముఖ్యం, విశ్వాసంతో మెసలాలి. ఇంటి సంగతులు కనీసం కన్న తల్లితో కూడా చెప్పకూడదు.

అన్నిటికీ తలవంచాను.

నాకు మంచి బట్టలు కుట్టించారు. ఉండడానికి చక్కని గది యిచ్చారు. ఇంట్లో దొరగారు, అమ్మగారు, పన్నెండేళ్ళ అమ్మాయిగారు, ఒక వంటవాడు, మరో యిద్దరు పనివాళ్ళు-

నేను సెక్రటరీ వంటివాడిని.

నా ఉద్యోగం చాలా బాగుంది. అయినా నా కోరికల జాబితాను విచిపెట్టలేదు. త్రిసంధ్యలు మననం చేసుకుంటున్నాను.

మొదటిసారి దొరగారి లైబ్రరీ లోని పుస్తకాలు దులుపుతున్నపుడు నాకళ్ళను నేను నమ్మలేకపోయాను.

పుస్తకాల షాపుల్లో షోకేసుల్లో నేను చూసి తపించిన పుస్తకాలు, ఈ యింట్లో అలమరాలలో వరుసలు తీర్చిఉన్నాయి. నేను వాటి సంరక్షకుడిని - దొరగారు ఉదయం పదికి వెళ్ళి మళ్ళా సాయంకాలం ఆరు తరువాత వస్తారు. ఎప్పుడు తీరిక దొరికితే అప్పుడు నేను చదువుకోవచ్చు. ఇంతసులువుగా నామొదటి కోరిక తీరినందుకు చాలా సంతోషం కలిగింది. లిస్టులోమొదటి కోరికను టిక్కు పెట్టి అక్కడ తేదీ కూడా రాశాను.

దొరగారి బొచ్చుకుక్కలు- తెల్లటివి- వాటిని నేలమీద నడిపించడానికి వీలులేదు. దొరగారు వాటికోసం మారుతీకారు పంపించేవారు. వాటితోపాటు నాకూ వాహనయోగం పట్టింది.

మరో కోరికకు టిక్కు పెట్టాను.

దొరగారి బంగళా చాలా పెద్దది. అందులో సాహిత్యానికోగది, సంగీతానికోగది, సంప్రదింపులకోగది. పూజకోగది, ఈ విధంగా ఎన్నో గదులున్నాయి. నా గది ప్రక్కనే సంగీతం గది ఉంది. అందులో ఆధునికమైన స్టీరియో సిస్టముంది. మంచి రికార్డులు, కాసెట్లు ఎన్నో ఉన్నాయి.

ఉదయం ఒక అరగంట వరకు దొరగారు ఆ గదిలో కూర్చొని భక్తి సంగీతంవింటారు. మధ్యాహ్నం నిద్రలేచి అమ్మగారు సినిమా పాటలు వేస్తారు. సాయంకాలం అమ్మాయిగారు. చాలా పెద్ద ధ్వనితో స్నేహితురాండ్రకు జాజ్ సంగీతం వినిపిస్తారు.

నా సంగీతం కోరిక కూడా తీరింది. తేదీ వేసి టిక్కు పెట్టాను.

దొరగారు చాలా పెద్ద ఉద్యోగంలో ఉన్నారు. ఆయన తరచు ఉన్నతమైన పదవులలో ఉన్నవారికి డిన్నర్లు ఇస్తారు. అమ్మగారు విధిగా క్లబ్ మెంబర్లని లంచ్‌కి పిలుస్తారు. అమ్మాయిగారు స్నేహితురాండ్రకు అల్పాహారం తప్పక పెట్టిస్తారు.

వంటవాడు ఎప్పుడూ హెచ్చుగానే అంచనా వేసి వండుతాడు. కాబట్టి, మాకు, అంటే దొరగారి యింట పనిచేసే వాళ్ళకు తిండి మస్తుగా దొరికేది. అది కూడా ఫైవ్ స్టార్ హోటల్ భోజనం.

నా భోజనం కోరిక కూడా తీరింది. తేది వేసుకున్నాను.

దొరగారు రోజూ ఒక అరగంట తన ప్రైవేటు ఛాంబరులో కూర్చుంటారు. అక్కడే అతను వచ్చినవాళ్ళతో మాట్లాడేవారు అతనితో పాటు నన్ను కూడా గదిలో ఉంచుకునేవారు. వచ్చిన వాళ్ళ సంభాషణ నేను వినదగినది కాదు- చెప్పుకోదగ్గదీకాదు. దొరగారు ఆ జనులిచ్చే బహుమతులను తన చేతులతో అందుకునేవారు కాదు- ఆనోట్లకట్టలు నేను తీసుకొని, నా గదిలో అలమరాలో ఉంచి తాళం వేసేవాడిని. దొరగారు ఎప్పుడూ నన్ను లెక్కలడగలేదు.

ఒక ఆరు నెలలు ఈ విధంగా సాగింది.

దొరగారు ఒక రోజు నాతో అన్నారు.

"వెంకటేశ్వరులూ! బీచిలో డీలక్స్ ఫ్లాట్‌లు కట్టారు- మూడు పడక గదులుంటాయి. వాటిని వేలం వేస్తారు. ఆ వరుసలలో చివరవి కొంచెం ధర హెచ్చుగా ఉంటాయి. మొదటి అంతస్తులో అటువంటి చివరి ఫ్లాట్ ఒకటి వేలంలో పాడి నీ పేర కొను. నీ దగ్గర ఎంతుంది?"

"పద!"

ఆ ప్లాటు చాలాపెద్దవి. రెండువేల చదరపుటడుగుల కట్టిన భాగముంది. వాటిలో కొనదానిని ఏడు లక్షలకు పాడి నా పేరకొన్నాను.

అమ్మగారు చెప్పినట్లు ఆ పిమ్మట ఆచరించమని దొరగారు ఆజ్ఞాపించారు.

మిగిలిన డబ్బుతో గోడలకు పెయింటింగ్ చేయించడం కొత్త డిజైన్ల బాత్‌రూమ్ ఫిట్టింగ్‌లు అమర్చడం, చాలా ఖరీదైన ఫర్నిచరు నింపడం మొదలైనవి అమ్మగారు పురమాయించారు. ఎంత పని! ఎంత పని! అంతగొప్ప ప్లాటు నా పేరున కొన్ననాడు, కోరికల జాబితాలో ఆఖరి దానిని టిక్కుపెట్టి తేదీ వేశాను.

ఆరునెలల్లో నా అయిదు కోరికలు తీరాయి.

ప్లాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చి దొరగారికి చూపించాను. మరునాడే దానిని అమ్మగారికి గిఫ్ట్‌గా యిచ్చి రిజిస్టర్ చేయించమని ఆయన సెలవిచ్చారు.

రిజిస్ట్రేషన్ పూర్తయ్యే సరికి మధ్యాభహ్నం రెండుగంటలయింది. ఆరు నెల్లయి మా వాళ్ళను చూడలేదని, అమ్మగారు అనుమతిస్తే వాళ్ళతో ఒక పూట గడిపి మరునాడు ఉదయమే ఉద్యోగానికి హాజరవుతానని అన్నాను.

నేను ఉద్యోగంలో చేరిన తరువాత లోకమంతా మారిపోయిందను కున్నాను. అటువంటిదేదీ జరగలేదు.

ఆరోజు సాయంత్రం లైబ్రరీకి వెళ్ళాను. పాతలైబ్రేరియన్ గారు మారిపోయారు. కొత్తాయన నాకుబాగా తెలిసినవారు- నన్ను చూసి ఆయన చాలా సంతోషించారు.

"వెంకటేశ్వరులూ! పుస్తకాలు కొనడంలో గొప్పదనం లేదు- వాటిని చదవడంలోనే ఉంది. గొప్ప వాళ్ళందరూ అలంకారం కోసం అలమరాలు నింపుతారు- నేను చాలా కొత్త పుస్తకాలు తెప్పించాను. నీకు ఇంటికి కూడా ఇస్తాను. తృప్తిదీరా చదువుకో!" అన్నారాయన.

ఎంత అదృష్టవంతుడని!

లైబ్రరీ నుంచి తిరిగి వస్తుంటే పొరుగింటి మామయ్యగారు కనిపించారు- నన్ను పిలిచారు.

"వెంకటేశ్వరులూ! కొత్త స్కూటరు కొనడానికి వెళ్తున్నాను- నువ్వు కూడారా! ఏ రంగుబాగుటుందో చూడు నాకు ఆఫీసుదగ్గర కదా! నీ పేర లైసెన్సు తీసుకుంటాను నిరభ్యంతరంగా వాడు!"

నేను చాలా ఆశ్చర్యపోయాను- కొత్త స్కూటరు నేనే నడిపాను- ఆయనకు నేనంటే అంత వాత్సల్యం!

మరునాడు నిద్రలేచే సరికి ఎనిమిదయింది. బద్దకంగా ఉంది. ఆరోజు పేపరు చూస్తే

వివేకానంద హాలులో సంగీత కచేరి ఉందని తెలిసింది. ఉద్యోగంలో చేరితే ఇటువంటి వాటికి మరి అవకాశం కుదరదు.

ఆ సాయంకాలం పదిరూపాయల టిక్కెట్ కొనుక్కొని కచేరీకి వెళ్ళాను- ఆయన మహానుభావుడు- త్యాగరాజుగారి అపరావతారం- సంగీతసభ నాలుగు గంటలు జరిగింది. నేను మనసు పడిన కీర్తనలన్నీ ఆయన పాడాడు.

మరునాడు కూడా ఉద్యోగానికి పోలేదు.

ఇంట్లో ఏవో పనులు చేస్తుంటే జ్ఞాపకానికి రాలేదు.

మా అమ్మ ఆ పూట ఇంగువ చారు కాచింది. చింతకాయపచ్చడి చేసింది. నిమ్మకాయ మజ్జిగ పోసింది. ఎంత బాగుంది భోజనం!

మధ్యాహ్నం నిద్రపోయి లేచాను. నాగదిలోంచి పెరిటిలోకి చూశాను. పొద్దున్న పాదులు కట్టిన మల్లెమొక్కలు చిగుళ్ళతో ఉన్నాయి. బాదంచెట్టె కిందరాలిన ఆకులలో ఎర్రటిపళ్ళు కనిపించాయి. విశాలమైన పెరడు- పెద్ద పెంకుటిల్లు - మా నాన్నకు మేమిద్దరమే కొడుకులం - కలిసి ఉంటే పెద్ద లంకంత యిల్లు- మా తమ్ముడూ నేనూ పంచుకున్నా పెద్ద భాగాలు - గాలి వెలుతుర్లు ధారాళంగా వచ్చే గదులు- ఈ యింటికేం లోపం వచ్చిందని.

మర్నాడు ఉదయం బట్టలు వేసుకున్నాను దొరగారి యింటికి పోదామని.

జేబులో కోరికల లిస్టు చేతికి తగిలింది.

అయిదు కోరికలు రెండోసారి కూడా తీరాయి.తేదీలు వేసి టిక్కులు పెట్టాను.

అయితే ముందు సెట్టా లేక వెనుక సెట్టా వుంచడం?

కోరికను నేను సరిగా నిర్వచించలేదు-మొదటిసారికి అవి తీరినట్లు సరిపెట్టుకున్నాను.

మొదటి రోజుల్లో దొరగారి లైబ్రరీలో ఒక కొత్త పుస్తకం చూస్తూ అలా ఉండిపోయాను. ఎక్కడికో వెళ్ళిన దొరగారు లోపలికి వచ్చి నన్ను హెచ్చరించారు.

"నువ్వు పుస్తకాలు దులపడానికి గాని, వాటిని చదవడానికి కాదు-"

చెంపలు వేసుకున్నాను- అనాటి నుంచీ పుస్తకం ముట్టుకుంటే ఒట్టు.

దొరగారి గ్రామ్‌ఫోన్ రికార్డులలో చాలా శాస్త్రీయ సంగీతముంది. త్యాగరాజ కీర్తనలున్నాయి. వాటిని తుడవడమే నాపని- వినే అధికారంలేదు- జన్మలో ఆ రికార్డులు వాళ్ళు వెయ్యలేదు.

ఉద్యోగంలో చేరిన మొదటి నాలుగు రోజులు మసాలా కూరలు, నూనెలో తీర్థమాడిన వేపుళ్ళు, ఐస్‌క్రీములు మొదలైనవి బాగానే ఉండేవి. క్రమంగా అవంటే భయం పట్టుకుంది. బ్రతికి పని చేయడానికి పలచని మజ్జిగ, అన్నం శరణ్యమయ్యాయి.

దొరగారి మారుతీకారులో చాలాసార్లు ప్రయాణం చేశాను- బొచ్చుకుక్కలను దానిలో తీసుకొని వెటర్నరీ హాస్పిటల్‌కి వెళ్ళివచ్చేవాడిని. దొరగారు ఒక వార్నింగ్ ఇచ్చారు.

"వాటిని హాస్పిటల్. ఆవరణలో నేలను నడిపించకు కొత్త రోగాలు పట్టుకుంటాయి."

హాస్పిటల్ కాంపౌండులో అరఫర్లాంగు దూరం వాటిని ఎత్తుకొని వెళ్ళే వాడిని. తిరిగి వచ్చేటప్పుడు వాటికి రాసిన లోషన్ నా బట్టలనిండా పట్టి, కంపు భరించలేకపోయేవాడిని. అందుచేత వాహనయోగం అంటేనే బెదురుపట్టుకుంది.

ఇక-వసతి-ఏడు లక్షల ఫ్లాటు- అందులో మూడులక్షల ఫర్నిచరు మొదలైనవి. ఆవసతి నా పేరున రెండునెలలపాటు ఉంది. కాని ఏం చెప్పను. ఒక రోజు కూడా దానిలో పడుక్కోలేదు. లోపలి మెత్తాలమీద కూర్చోలేదు. కాపలా వాడిపక్కన చింకిచాపమీద బైట పడుక్కున్నాను.

అందుచేత మొదటి తేదీలన్నీ కొట్టేశాను.

వీధిలోకి అడుగుపెట్టానో లేదో స్కూటరు శాస్త్రులుగారు ఎదురుగా వచ్చారు.

"ఒరే వెంకటేశ్వరులూ! నీకేం పోయేకాలంరా! దొరగారు మండిపడుతున్నారు. ఆయన గుట్టుమట్లు గుప్పెట్లో పెట్టుకున్నానని అనుకుంటున్నావేమో! కనిపిస్తే తుపాకీతో నిన్ను కాల్చిపారేస్తారు."

కోరిక తీరిన శుభవేళ.

దూరదేశాలకు పారిపోతున్నాను బ్రతకడానికి.

విశాలాంధ్ర - ఆదివారం అనుబంధం

☆